# సాహెబ్, బీబీ, ఔర్ సైతాన్

"అతన్నంతా సైతాన్ అంటారు కదూ" అంది దొరసాని వెళ్లిపోతున్న మానేజరుని సాలోచనగా చూస్తూ.

"ఎవడా అన్నది? శిస్తులు పకడ్బందీగా వసూలు చేస్తున్నాడని రైతులే అతనికా పేరు పెట్టారేమో. చచ్చుదద్దమ్మలూ, చవట పీనుగులూ ఇన్నాళ్లూ నా మేనేజర్లుగా ఉండి చేతకాక చేతులు ముడుచుక్కూచున్నారు. ఇతనొచ్చాక జమీ ఆదాయం పెరిగింది. అందుకని అసూయ కొద్దీ వాళ్లంతా కలిసి ఇలాటి పేర్లు పెట్టారేమో" అన్నాడు దొర.

"ఆ నల్లపాంటు, నల్లసాక్స్, నల్ల గ్లవ్స్ చూడండి. మనిషి కూడా కారు నలుపు. దెయ్యంలా ఉంటాడు. సైతాను అన్నారంటే అనరూ? కానీ ఈ రూపాన్ని చూసి అంతమంది ఆడాళ్లు అతనంటే ఎలా పడి ఛస్తారో తలచుకొంటేనే ఆశ్చర్యంగా ఉంది." అంది దొరసాని వడ్డాణం సవరించుకుంటూ.

"చూసావా, మళ్లీ ఇంకో పుకారు. ఆ కుర్రాడు కాస్త కఠినంగా ఉంటాడు. కఠినంగా మాట్లాడుతాడు. రైతులు శిస్తు ఎగకొడితే చమ్డా లెక్కదీస్తాడు. జాలీ, కరుణా ఉన్నట్టు కనబడదు. అంత మాత్రాన సైతాను, గీతాను, తిరుగుబోతు అనేయడమే!?" అన్నాడు దొర మేనేజరును వెనకేసుకొస్తూ.

"పోన్లెండి, పెళ్లయిన మూడు నెలల్లోనూ మీతో వాదించి నేనెప్పుడు నెగ్గాను కనక? ఇంతకీ ఎందుకు వచ్చాడట?"

"ఏవో, జమీందారీ గొడవలు. మనం భోజనానికి లేద్దామా?"

"సరే, పదండి." అంటూ దొరతో కలిసి భోజనాల హాలుకి వెళుతూనే దొరసాని ఉండబట్టలేక మళ్లీ మేనేజరు సంగతి ఎత్తింది. "మిమ్మల్ని ఏ విషయంలోనో ఒప్పించడానికి మహా శ్రమ పడుతున్నట్టున్నాడు..."

"ఎవరి సంగతి మాట్లాడుతున్నావు?" అన్నాడు దొర పరధ్యాన్నంగా, నడుస్తూనే దొరసాని భుజాలు నిమురుతూ.

"అదే, మీ మొనగాడు మేనేజరు గురించి" అంది దొరసాని వెక్కిరిస్తూ.

"అదా, అతని బాధ అతనిది. రైతులంతా బాగా పొగరు బట్టి ఉన్నారంటాడు. కఠినంగా శిక్షిస్తామని భయం ఉంటే తప్ప వాళ్ల దగ్గర్నుంచి వసూళ్లు రావంటాడు. మా నాన్నగారి కాలం నాటి భూగృహం మళ్లీ తెరిస్తే మంచిదంటాడు."

"అంటే... మీ నాన్నగారి గురించి అతనికెలా తెలుసు?"

"మా నాన్న గారి గురించీ, కోటలో ఉన్న భూగృహం గురించీ ఈ ప్రాంతంలో వినని వారెవరు? పన్నులు సరిగ్గా కట్టని వాళ్లను నాన్నగారు ఆ భూగృహంలో రెండు రోజులు పెడితే చాలు, ఎంతటి మొండి వెధవలూ లొంగి వచ్చేవారని అందరూ ఇప్పటికీ చెప్పుకుంటారు. అదెక్కడ ఉందో ఎవరికీ తెలీదు కానీ, దాని గురించి చాలా కథలు వ్యాప్తిలో ఉన్నాయి."

"నేనూ విన్నాను లెండి. ఆయన చండశాసనుడనీ, ఆయనకు ఇరుగు, పొరుగు జమీందార్లలో చాలామంది శత్రువులున్నారనీ, రైతులని కాల్చుకు తినేవాడనీ..."

"ఆయన వల్లనే మా వంశప్రతిష్టకు కళంకం వచ్చింది. ఆ మచ్చ పోగొట్టడానికే నేను నా హయాం వచ్చాక రైతుల పట్ల ఉదారంగా ఉంటూ వచ్చాను. దాంతో వాళ్లకు అలుసైపోయాను. ఇదిగో ఈ

మేనేజర్‌ను తీసుకొచ్చాక పరిస్థితి మెరుగుపడింది. కానీ ఆ భూగృహం మళ్లీ తెరవమని అనడం నాకు నచ్చటం లేదు..."

"అందుకే అతన్ని సైతాను అన్నాను నేను..."

"నువ్వో బుజ్జి చిలకవి. నీకందరూ సైతాన్లాగ, మాయలమరాఠీలాగా అనిపిస్తారు."

"అలా అయితే మీరు గోరింక అంటారు..."

"ముసలి గోరింక..." అన్నాడు దొర తన నెరిసిన గడ్డాన్ని నిమురుకుంటూ.

"ఏమో, నా కంటికి మాత్రం మీరు పదహారేళ్ల బాలా కుమారుడిలాగానే అనిపిస్తున్నారు." అంది దొరసాని భర్తను దగ్గరకు తీసుకొని హత్తుకుంటూ.

"అయితే మనిద్దరిదీ ఒకే వయసు అన్నమాట" అన్నాడు దొర మురిసిపోతూ.

భోజనం చేస్తూండగా దొరసాని భూగృహం మాట ఎత్తింది. "పెళ్లయి రాగానే నాకు కోటంతా చూపించారు. ఆ భూగృహం మాత్రం చూపించనేలేదేం? ఎలా ఉంటుందో మరి? చూడాలని ఉంది."

"కోటలో ఉన్న వాళ్లకే చాలామందికి అది ఎక్కడ ఉందో తెలీదు. ఇప్పుడు వాడటం లేదుగా. పైగా అది ఓ పట్టాన కనబడదు. మామూలు నేలలా కనబడే చోటే ఓ గుర్తు ఉన్న చోట వెతికితే నేలబారుగా ఓ తలుపు కనబడుతుంది. దానిలో బాధలు పడిన వాళ్లు సైతం దాన్ని వెతికి పట్టుకోలేరు. కళ్లకు గంతలు కట్టి తెచ్చేవారు మా పనివాళ్లు. అయినా నీకంత ఆసక్తిగా ఉంటే భోజనమయిన తర్వాత చూపిస్తానులే."

"నా బుజ్జి గోరింక, నా ముచ్చట తీర్చే గోరింక" అంటూ బుగ్గల మీద ముద్దాడింది దొరసాని వంటవాళ్లు అలా వెళ్లగా చూసి.

"నిన్ను సైతాను అంటారుట" అంది దొరసాని జుట్టు దువ్వుకుంటూ.

"ఏం? మీకేమైనా అభ్యంతరమా?"

"నాకెందుకు అభ్యంతరం ఉండాలి? నన్నేమైనా ముగ్గులోకి లాగుతున్నావు కనకనా?"

"ముగ్గులోకి లాగేవాళ్లు చెప్పి లాగరు."

"అంటే చెప్పకుండా లాగుదామనా?"

"లాగి తీరాలంటే తప్పుతుందా మరి?"

"నీ ఆకర్షణ మీద నీకు బాగా నమ్మకం ఉన్నట్టుందే"

"మీలాగే.."

"నీవన్నీ వంకర మాటలే.."

"సైతాను లాగ...?"

"నిక్షేపంలా....... సైతానులాగే. సైతాను లాగ నువ్వు తుంటరివి కూడా."

"నేను తుంటరి నయితే, దేవతా వస్త్రాలు ధరించిన సౌందర్య దేవత నన్ను తన డ్రెస్సింగ్ రూముకి పిలిపిస్తుందా?"

"......... దేవతల



చెడగొడటానికేగా సైతాను చెంత చేరతాడు! మా వారి చెంత చేరి ఆ భూగృహం మళ్లీ తెరవమని పాడు సలహాలు ఇస్తున్నావుటగా."

"అలా అని మీ వారే మీతో చెప్పారా?"

"అవును. అలా చెప్పి దాన్ని నాకు చూపించారు కూడా. అబ్బ, ఎంత భయంకరంగా ఉందో. అది తిరిగి తెరవమన్నవాళ్లు ఎంత క్రూరులో నాకు తెలిసివచ్చింది. దేనికైనా తెగించేరకం వాళ్లు. ఎంత కావల్సినవాళ్లనైనా హింసించేందుకు వెరవనివాళ్లు. ఆ గదిలో చీకటి, చెమ్మ. ఎక్కడో పాతాళంలో ఉంది. గొంతుచించుకున్నా ఏ నరప్రాణికీ వినబడదు. అసలు అక్కడ ఎవరైనా బందీ అయినట్టు ఎవరికీ తెలిసి చావదు.."

"మీ కళ్లు మెరుస్తున్నాయి. మీకది బాగా నచ్చినట్టుగా ఉంది."

"నచ్చడమా? నీకేమైనా మతిపోయిందా? తలచుకొంటేనే ఒళ్లు జలదరిస్తోంది."

"అప్పటిమాట ఎలా ఉన్నా, ఈ సంగతి చెబుతూ మీ ఒళ్లు జలదరింపచేస్తూంటే చూడ ముచ్చటగా ఉంది."

"... ఆ చక్రం ఉందే..., ఆ ఇనుపబూటు..., ఆ బండకొయ్య... దానిలో పెడితే చేతులూ, పాదాలూ... అవునూ, నా పాదాలు చూసావా, ఎంత చిన్నగా ఉన్నాయో..."

"భలే అందంగా ముద్దొచ్చేట్టు ఉన్నాయి."

"కాలివేళ్లు కూడా చిన్నగా, నాజూగ్గా ఉన్నాయి కదూ. నాకు కాలివేళ్లు పెద్దగా ఉంటే నచ్చదు. నీవెలా ఉంటాయి?"

"దొరసాని గారు మర్చిపోతున్నారు - సైతానుకి పాదాలూ, వేళ్లూ ఉండవు. గుర్రం డెక్కలు ఉంటాయి."

"అవును. మర్చేపోయాను. మరి తోకేదీ? నీ కొమ్ములేవీ?"

"మీ వారికిచ్చేశా ఆ కొమ్ములు. దొరలకుండాలి. నా లాటి పనివాడికెందుకు?"

"దానికేముంది, నువ్వే ఎప్పటికైనా దొరవు కావచ్చు. ఆ కొమ్ములు నీవే ఉంచుకొని తోక ఆయనకిచ్చేయి. అది పెట్టుకుని ఆ భూగృహంలో ఆ పంజరంలో కోతిలా కూచుని తోక కిందకు వేలాడేసుకుని కూచుంటారు."

"ఏ పంజరం?"

"చెప్పలేదు కదూ, ఆ భూగృహంలో ఓ పంజరం ఉంది. ఓ కోతి పట్టేటంత మాత్రం ఉంది. కానీ దాంట్లో మనుషుల్ని పెట్టేవారని మా వారు చెప్పారు. అందులో పెట్టిన వాళ్లు నిలుచోలేరు, పడుక్కోలేరు. కూచోడం కూడా కష్టమే. కూచోవాలంటే ఇనప ముళ్లమీద కూచోవాల్సిందే. జంతువులా ఒంగి ఉండాల్సిందే. ఆ విధంగా రోజుల తరబడి ఉంచేవారట. ఒక్కోప్పుడు వారాల తరబడి కూడా. తలచుకుంటేనే ఒళ్లు గగుర్పొడుస్తోంది. దాంట్లో పెట్టినవాళ్లు విడిచిపెట్టమని వెర్రిగా కేకలు పెట్టేవారట. అలా అరిచి, అరిచి పిచ్చెక్కిపోయేదట. నా మట్టుకు నాకు ఆ బండకొయ్య ఎక్కించినా ఫర్వాలేదు కానీ..."

"...అదెక్కి అందమైన పాదాలు నలిగిపోయినా ఫర్వాలేదు కానీ..."

"అలా మాట్లాడకు. ఒళ్లు జలదరిస్తుంది."

"జలదరిస్తే చూడాలనే అలా అన్నది."

"నువ్వు అచ్చమైన సైతానువి. ఇక నువ్వు వెళితే మంచిది. దొరగారు ఏ క్షణాన్నైనా రావచ్చు."

"రేపు మళ్లీ కలిసేదా, దొరసానీ..."

"నేను కబురంపుతానులే, ప్రస్తుతానికి వెళ్లు."

అతను వెళ్లిపోయాక, తన డ్రెసింగ్ స్టూలు మీద కూచుని దొరసాని ఆలోచనల్లో పడిపోయింది.

మేనేజరు ముద్దుపెట్టుకుని వెళ్లిపోయిన కాలివేళ్లను నిమిరింది. వెచ్చగా తోచింది. వెచ్చని ముద్దుల గురించి పాటల్లో వింది. ఇవాళే అనుభవించింది. మేనేజరు శరీరం సలసల కాగుతోంది. తన శరీరాన్ని కలవాలని కలవరిస్తోంది. కలవరించనీ, ఖంగారేం? ఎప్పటికో అప్పటికి తను పక్క పంచుకోక మానదు. అప్పటివరకైనా ఆ సైతానుని తపించనీ. ఉల్లిపొర దుస్తుల్లోంచి కనబడే తన అందాలు అతన్ని ఊరించనీ. అది తలచుకొని, తలచుకొని క్రమంగా పిచ్చెక్కిపోయి తను చెప్పినట్టు విననీ.

జుట్టుముడి వేసుకోడానికి దొరసాని చేతులు పైకెత్తింది. తన వక్షంపై ఆమె చూపులు పడి గర్వంతో ఆమె ఛాతీ మరింత పొంగింది. వీటిని చూసే కదూ ముసలి దొర తన వెంట పిచ్చికుక్కలా పడింది. పెళ్లి చేసుకొంటానని మాటిచ్చేవరకూ తను ముట్టుకోనిచ్చిందా. ఈ మేనేజరుని మాత్రం ముట్టుకోనివ్వాలి. ముద్దు పెట్టుకోనివ్వాలి. దొరంత అమాయకుడు కాదు వీడు. ఆడాళ్లని మరిగినవాడు. అహఁ, అప్పుడే కాదు. పెదాలు ఇప్పుడిప్పుడే అందివ్వకూడదు. కాళ్లమీద, వేళ్లమీద, మహా అయితే నుదుటిమీద. క్రమక్రమంగా వేడి పుట్టించాలి. వేడెక్కి వేడికోళ్లు వేడాలి. మొర్రోమని ఏడవాలి. తాకనిస్తే చాలని గంగవెర్రులెత్తి పోవాలి.

పక్కమీదకు వాలుతూ ఆమె తన రూపాన్ని అద్దంలో చూసుకుంది. ఆలోచనల్లో పడింది. ఆడదిగా పుట్టడం, అందునా అందంగా ఉండడం ఎంత అదృష్టం. తన అందం చూసే కదా పేదదానినని కూడా చూడకుండా దొర పెళ్లాడాడు; ఈ సైతాను మేనేజరు వెంటపడుతున్నాడు. ఈ మేనేజరు సమర్థుడు. తన భర్త పిరికి చవట. రైతులను అదలించలేని అసమర్థుడు. ఈ మేనేజరు లాటివాడు వెంటనుంటే జమీనంతా తను పాలించవచ్చు. దొరను భూగృహంలో బందీ చేస్తే సరి. ఎక్కడి కెళ్లాడని ప్రజలు అడిగితే తమకు తెలీదంటే చాలు. భూగృహం ఎవరికి తెలుసు కనక? అరిచి, గీ పెట్టినా ఎవడికీ వినబడి చావదు. తను దొరసానిగా రాజ్యం ఏలుతూ మేనేజరుకు పూర్తి అధికారాలు ఇచ్చేస్తే చాలు.

రైతుల్ని చావగొట్టి ఈ మేనేజరు జమీ ఆదాయం పెంచుతాడు. పొరుగునున్న వెంకటాపురం జమీందారు రంగరాయుడికి కళ్లు కుడతాయి. అసలే కోడె వయసులో ఉన్న సోగ్గాడు. పక్కజమీని ఓ అందగత్తె ఒంటరిగా పాలిస్తూంటే కన్నుపడకుండా ఉంటుందా? మేనేజరుగాడిని లేపేసి, తననీ, తన జమీనీ ఆక్రమించాలని చూస్తాడు. తనను పెళ్లాడమని కబురంపుతాడు. అప్పుడు తనేం చేయాలి? రెండు రాజ్యాలకూ కలిపి రాణీని చేయమని షరతు పెట్టాలి. ఒప్పుకుంటాడా? ఒప్పించడంలోనే ఉంది తన ఘనత. మగాళ్లు తనంటే ఎలా పడి ఛస్తారో తనకు తెలీదూ? అందీ అందనట్టు చిన్న చిన్న కొసరులు పెడితే చాలు మగాళ్లు వెర్రెక్కిపోతారు. కుక్కల్లా నాలుక చాచి, ఒగర్చుకుంటూ వెంటపడతారు. ఈ మేనేజరు గాడిని చూస్తేనే తెలుస్తుంది తన తడాఖా. ఇప్పుడున్న బింకం కూడా సడలుతుంది. ఆకలి తీర్చమని ఏడుస్తాడు. బాగా డొక్క మాడుస్తుంది తను. అలా మాడ్చి, మాడ్చి ఎప్పుడో తనకు జాలి కలిగినప్పుడు 'రా భోంచేద్దువు గాని' అంటూ విందుకు పిలుస్తుంది. అతడు ఎగబడి, ఆరగించబోయి, ఇన్నాళ్ల ఆకలి ఒక్కసారి తీర్చుకోబోయి భంగపడడం ఖాయం. అతని ఆత్రం చూసి తను నవ్వుతుంది. నవ్వుతూనే నిమిషాల్లో మళ్లీ ఆకలి రగిలిస్తుంది. అతను మళ్లీ విందుకు తయారవుతాడు. ఈ సారి తాపీగా, కడుపారా, తనివితీరా... అబ్బ, భలేగా ఉంటుంది, సైతానుతో ప్రణయం!

"అందరూ నన్ను సైతానంటారుగా. మరి నేను ఇలా నీ ప్రేమ కోసం దేబిరించడం దేనికి? హాంఫట్ అని ఏదో మంత్రం వేసి నిన్ను వశపరచుకోవచ్చుగా."

"బహుశా ఇది నువ్వాడే ఓ ఆటయేమో. సైతాను ఎంతకైనా తగును. ఇదిగో ఈ అరచేయి ముద్దుపెట్టుకోడానికి కూడా వెరవడు."

"అరచేయి కాదు, పెదాలే ముద్దు పెట్టుకుంటాడు."

"అమ్మో, నీ వ్యవహారం ముదురుతోందే. నువ్వింక దయచేస్తే మంచిదేమో."

"నీ సంగతి నాకు అర్థం కాదు. దగ్గరుండి కోటంతా చూపించావు. కోటలో ప్రతీ అంగుళం ఎరిక పరిచావు. కానీ నీ శరీరం మాత్రం దాచుకుంటున్నావు..."

"ఖర్మం చాలక రేపు నువ్వు దొరవైతే కోట ఆనుపాన్లు చూసుకోవద్దూ. అందుకే కోట చూపించా."

"దొరగారి కోటలో పాగా వేయడం కంటే, దొరసాని ఒడిలో పాగా వేయడమే నా కిష్టం."

"నువ్వూ, మీ దొరా ఇలా దొరసాని వెంట పడి తిరుగుతూండండి. అవతల రంగారాయుడు జమీందారు మన జమీ మీద కన్నేసి ఉంచాడని అంటున్నారు. ఎప్పుడు జమీని కబళిస్తాడో ఏమో."

"కావాలంటే దొర జమీని కబళించమను. దొరసానిని నాకు వదిలిపెట్టమను."

"ఇంత పెద్ద జమీ కంటే నా మీదే మనసు పడ్డావని నువ్వన్నమాటకు సంతోషిస్తున్నాను. దానికి బహుమతిగా నీ కో చిన్న ప్రమోషన్ ఇస్తున్నాను. రా, ఇలారా... పక్కగా కూచో, చేతులు కట్టుకుని నిలబడనక్కర్లేదులే. మాటవరుసకి నిన్ను పెదాలమీద ముద్దు పెట్టుకోనిచ్చానే అనుకో, దానికి బదులుగా నాకేమి ఇస్తావు?"

"ఏం కావాలంటే అది."

"నువ్వసలే సైతానువి. సైతాను ఎవరికైనా ఏదైనా ఇస్తే బదులుగా పాపాలు చేయిస్తాడంటారు. ఈ అందమైన శరీరం చేత పాపాలు చేయిస్తావా? పాపం చేస్తే పాతాళంలో పడిపోతాను. గొంతు ఎండిపోయేటట్టు అరిచి కేకలు పెట్టాల్సి వస్తుంది. అయినా ఎవరూ వచ్చి కాపాడరు. నరకబాధల్ని తప్పించడం ఎవరి తరం? ఎందుకొచ్చిన బాధ ఇదంతా? నువ్వు నన్ను మర్చిపోయి వెళిపోతే పోలా?"

"నరకబాధ పెడుతున్నది నువ్వు. నన్ను సైతాను అంటున్నావు కానీ అసలు సైతానువి నువ్వు. కవ్వించి, కవ్వించి అందకుండా చెలగాటమాడుతున్నది నువ్వు. నీ ముందు మోకరిల్లి, దీనంగా ప్రాధేయపడి భంగపడుతున్నది నేను. నేనీ బాధ పడలేను. నిన్ను రోజూ చూస్తూ ఏమీ చేయలేని నిస్సహాయుడిగా ఉండడం నా వల్ల కాదు. రేపే జమీ వదిలి వెళ్లిపోతా."

"అప్పుడే అంత కోపమా, నా సైతాను ప్రియుడా. ప్రేమంటే ఆట కాదా. కామకేళి అని వినలేదా? కేళి అంటే ఆటేగా. ఆట మధ్యలో మానేస్తే అవతలి వాళ్లు ఉడికించరూ. మా బుజ్జి సైతాను ఉడుక్కుంటే ఎంత బాగుంటాడో తెలుసా? ఉడుకుడుకు మారి, ముద్దుల్లో ఊరి..రా, రా. ఇదిగో ఈ పెదాలు చప్పరించి ఇవాళ్టికి ఊరుకో. సరేనా?"

"సరిపోదు. మొత్తమంతా కావాలి. పెదాలనుండి పాదాలదాకా."

"ఇంకేం మరి. త్వరగా కానీ. మన ఆశలు ఫలించే కాలం వచ్చింది. అబ్బ, కాస్త సుతారంగా ఉండు సైతాన్... ఎంత సైతానైతే మాత్రం మరీ అంత మోటా?"

"నువ్వు వాడిని సైతానంటే నేను ఒప్పుకోలేదు ఆనాడు. ఈనాడు ఒప్పుకుంటున్నాను. నమ్మకద్రోహి! నా కోటలో నా భార్యతోనే... కులుకుతాడా...?..."

"నేను అలాటిదానినని మీరెలా అనుకుంటున్నారు, ప్రభూ? చెప్పుడు మాటలు..."

"...చెప్పుడు మాటలా? నువ్వింకా బుకాయింపు మానవన్నమాట! వాడు రాత్రికి రాత్రి పారిపోయేడు, చెప్పాపెట్టకుండా. ఎందుకుట? అది చెప్పు. ఏదో వెధవ పని చేయడం వల్లనే కదా. పైగా నీ వడ్డాణం... మా అమ్మగారి వడ్డాణం... మా వంశచిహ్నం.. వాడి గదిలో! వాడి నల్ల గ్లవ్, సైతాను గ్లవ్ అనేదానివిగా... అదే, నీ పడగ్గదిలో ...ఇంకా బుకాయిస్తున్నావు. భ్రష్టురాలా!"

"నిజమే నేను పతనమయిపోయాను. ఆ సైతాను మూలంగా..."

"కల్లబొల్లి ఏడుపులు ఆపు. నిన్ను నెత్తి నెక్కించుకున్నందుకు తగిన శాస్తి చేసావులే. అయినా నీ మీద ప్రేమ చావలేదు. నీ గర్వాన్ని అణచడానికి ఓ అవకాశం ఇచ్చి చూస్తాను. అణిగిందో సరేసరి... క్షమిస్తాను. లేదూ, ప్రాణాలు తీస్తాను..."

"మీరేం చేసినా భరిస్తాను ప్రభూ..."

"భరించాలి. అందుకే ఈ భూగృహానికి తీసుకువచ్చాను. నాకు మా నాన్నగారి పోలిక రానందుకు సంతోషించు. ఆయనే నా పరిస్థితిలో ఉంటే నిన్ను గుడ్డలూడదీసి ఆ పంజరంలో పెట్టేవాడు. నేను పోనీ కదాని చిన్న శిక్ష వేస్తున్నాను. ఇవాళ రాత్రంతా నువ్వు ఒకత్తివీ ఈ భూగృహంలోనే ఉండు, తిండీ తిప్పలూ లేకుండా. అరిచి గోల పెట్టకు. కంఠశోష. ఎవరికీ వినబడదు. రాత్రంతా కూచుని నువ్వు చేసిన తప్పు గురించి ఆలోచించు. తెల్లారేసరికి నీకు బుద్ధి వస్తుందని ఆశ పడుతున్నాను. రాకపోతే నీ ఖర్మ, నా ఖర్మ."

"అతన్ని సైతాను అనేవారందరూ. నేను మాత్రం దేవుడంటాను. నేను చెప్పినట్లుగానే చేసుకొచ్చాడు. ముందు రైతుల్ని పన్నుల వసూళ్ల పేరుతో రెచ్చగొట్టి ముసలి దొరకు వ్యతిరేకంగా తిప్పాడు. ఆ తర్వాత ఎలా సంపాదించాడో ఏమో కోట గుట్టుమట్లన్నీ సేకరించి పట్టుకువచ్చాడు. ఎక్కడ ఏ గోడ బలహీనంగా ఉందో, కాపలావాళ్ల వేళలేమిటో, సమస్త సమాచారం పట్టుకొచ్చేసాడు. దాంతో మన సైనికుల పని సులభమైపోయింది. రాత్రి ముట్టడించామా, తెల్లారేసరికి కోట చేతికి చిక్కింది."

"రంగరాయుడు గారూ, మీ తెలివి అమోఘం. మీ వెంకటాపురం జమీకి తోడు ఇది కూడా చేరింది కాబట్టి, ఈ పట్టున మిమ్మల్ని మించిన రాజా లేడు. మీ సైతాను ఏడీ, ఎక్కడా కనబడడేం?"

"ఏమో, నాకూ కనబడలేదు. డబ్బిచ్చానా, అదుచ్చుకుని తుర్రుమన్నట్టున్నాడు. మహా టక్కరిముండా కొడుకు. మనలో మన మాట, డబ్బిచ్చినట్టే ఇచ్చి కోట చేతికి చిక్కగానే వీణ్ని లేపేద్దామనుకున్నాను. ఇంత తెలివైనవాడు చుట్టుపట్ల ఉండడం ప్రమాదం. వాడు మనకంటే తెలివైన వాడులా ఉన్నాడు. తెల్లారే లోపులే ఊరు దాటేసినట్టున్నాడు."

"ఇక్కడ లేకపోయిన తర్వాత ఎక్కడికెళ్తే మాత్రం ఏం ప్రమాదం లెండి. అవునుగానీ, ఆ శూలానికి గుచ్చిన తల, ముసలి దొరగారిదా?"

"చూడు, ఎంత ముసలాడో, పడుచుపిల్లను కట్టుకున్నాడు సిగ్గులేకుండా. వీళ్ల నాన్న మా జమీలో ఎంతమందిని చెరిచాడో లెక్కలేదు. మా మీద కత్తికట్టిన వాళ్లందరికీ ఇదే గతి."

"ఆ పడుచు దొరసాని ఏమయిందో?"

"అదొక్క బాధే మిగిలిపోయింది నాకు. దొరక్కుండా పారిపోయింది. దొరికితే దాని తల కూడా మొగుడి తల పక్కనే గాలికి ఊగుతూ కనబడేది. కానీ తల తీయించేముందు ఒక్కసారి తనివితీరా అనుభవించేవాణ్ని. గొప్ప అందగత్తెటలే. దానికోసమైనా కోట అంతా గాలించమన్నాను. రాత్రికి రాత్రి ఎలా మాయమయిపోయిందో ఎవర్నడిగినా చెప్పలేకపోయారు. మనకు తెలీని రహస్య స్థావరాలేవైనా ఉన్నాయాని సైతాను గాడిని అడుగుదామంటే వాడు పారిపోయాడు. ఎంత వెతికినా దొరసాని ఆచోకీ చిక్కలేదు. ఎక్కడకైనా పారిపోయిందో ఏమో. ఈ చుట్టుపట్లే ఉంటే దాని కోటకి ఏ గతి పట్టబోతోందో తెలుసుకొంటుందిలే."

"ఏమిటి సంగతి? కోట కూల్చేయబోతున్నారా ఏం?"

"పూర్తిగా నేలమట్టం చేసేయడమే. దాని మీద నా విజయచిహ్నంగా ఓ రాతి మండపం ఒకటి కట్టించేస్తాను."

"దొరసానికి ఈ విషయం తెలిసి ఏడుస్తుందేమో.."

"ఏడవనీ, గొంతెత్తి ఏడవనీ. చచ్చేదాకా ఏడవనీ. నరకకూపంలో పడిన వారు అరుస్తారంటారు చూసావా. అలా అరిచి మొత్తుకోనీ. అప్పుడు గానీ తగిన శాస్తి జరగదు."